



• అపర భద్రాద్రిలో ఎదుర్కోలు ఉత్సవం

చాట్రాయి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అపరభద్రాద్రి చనుబండలో శనివారం రాత్రి స్వామి ఎదుర్కోలు ఉత్సవం (వధూవర అన్వేషణ) కన్నుల పండువగా జరిగింది. సుదర్శన మాధవ శ్రీనివాసాచార్యులు యాజ్ఞికుల ఆధ్వర్యంలో పూజల అనంతరం దశరథ మహారాజు తరపున కొందరు పెద్దలు, జనక మహారాజు తరపున మరి కొందరు పెద్దలు వేదికపై ఆసీనులై రాముడు, సీతాదేవి గుణగణాలను కీర్తించారు. హాస్య సంభాషణల అనంతరం తాంబూలాలు మార్చుకున్నారు. ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

## • సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నూజివీడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 11న నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్న దృష్ట్యా పర్యటన ఏర్పాట్లను శనివారం అధికారులతో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. అగిరిపల్లి శివారు వడ్లమానులో హెలిప్యాడు, బహిరంగ సభకు సంబంధించి అధికారులు ప్రతిపాదించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. హెలిప్యాడ్‌కు ప్రతిపాదించిన స్థలంలో హెలికాప్టర్ లాండింగ్ అయ్యేందుకు అనువైన ప్రదేశాన్ని గుర్తించాలని, పరిసర ప్రదేశాలలో పటిష్ఠ భద్రత ఉండేలా స్థలాన్ని గుర్తించాలన్నారు. హెలీప్యాడ్ నుంచి బహిరంగ సభకు తక్కువ దూరం ఉండేలా చూడాలన్నారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజల సంఖ్యనుసరించి అంత సామర్థ్యం కలిగిన ప్రదేశాన్ని గుర్తించాలన్నారు. వేసవి దృష్ట్యా బహిరంగ ప్రదేశంలో ప్రజలు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని, హాజరయ్యే ప్రజల సంఖ్యను బట్టి టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీవో బి.ఆనందరావు, అగిరిపల్లి సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి, వడ్లమాను సర్పంచ్ జలసూత్రం లక్ష్మీ కుమారి, నాయకులు నెరుసు సతీష్, ఎం.సత్యకుమార్, చిట్నేని శివరామకృష్ణ, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై...

# జీఎస్టీ పిడుగు



- గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాల సేకరణ
- త్వరలో నోటీసులు పంపనున్న కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేసిన వారిపై జీఎస్టీ పిడుగు పడనుంది. గత మూడేళ్లల్లో పనులు చేసిన వారి వివరాలను తమకు అందజేయాలని ఆ శాఖ అధికారులు ఎంపీడీవోలను కోరడం గమనార్హం. ఈ విషయం తెలిసి జిల్లాలో పనులు చేసిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. గత మూడేళ్లల్లో టీడీపీ ప్రభుత్వం రాకముందు వైసీపీ హయాంలో ప్రతీ మండలంలో వివిధ రకాల అభివృద్ధి పనులను గ్రామాల్లో నిర్వహించారు. మండల పరిషత్ పగ్గాలు వైసీపీ చేతిలో ఉండడంతో పనులన్నీ ఆ పార్టీ నాయకులే నిర్వహించారు. అయితే పనులు నిర్వహించిన వారిలో జీఎస్టీ నంబరు కలిగిన వారికి పెద్దగా ఇబ్బంది లేదు. వారు ఎప్పటికప్పుడు జీఎస్టీ వివరాలను కమర్షియల్ టాక్స్‌కు అప్‌డేట్ చేస్తుంటారు. కాని ఎక్కువ మంది జీఎస్టీ ఖాతాలు లేనివారే నామినేషన్ పద్ధతిలో గ్రామాల్లో పనులు నిర్వహించారు. ఇప్పుడు వారందరూ నోటీసులు అందుకోనున్నారు. 18 శాతం చొప్పున దీనికి అదనంగా వడ్డీతో సహా జీఎస్టీ రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. రూ.ఐదు లక్షల విలువైన వర్క్ చేస్తే దాదాపు రూ.90 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఎప్పుడో చేసిన పనులను ఇప్పుడు అదనంగా డబ్బులు చెల్లించాల్సి రావడంతో పనులు చేసిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. నోటీసులు అందితే దానిని బట్టి ఏం చేయాలో చూద్దామంటూ వైసీపీలోని పెద్దలు తమ నాయకులను ఊరడిస్తున్నారు. కాగా దీని ఎఫెక్ట్ కొత్తగా నిర్వహించబోయే పనులపైనా పడుతుంది. మండల పరిషత్ నిధులతో పనులు నిర్వహించడానికి పనుల వివరాలు అందజేస్తే వర్క్ ఆర్డర్స్ ఇస్తామని చెబుతున్నా గ్రామాల్లో వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ముందుకు రావడానికి జంకుతున్నారు. 18 శాతం జీఎస్టీ చెల్లిస్తే తమకు మిగిలేదేముందని వెనుకాడుతున్నారు. దీంతో మండల ఖాతాల్లో ఉన్న నగదుతో అభివృద్ధి పనులు నిర్వహించడానికి ఇరువర్గాల మధ్య సఖ్యత కుదిరినా జీఎస్టీ వ్యవహారంతో ముందుకు సాగడంలేదు.



## సీతారాముల కళ్యాణం చూతము రారండి

శ్రీ రాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్న దీపం
ఆజానుబాహుం అరవిందదళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి

అంటూ శ్రీరామ నవమిని వాడవాడలా జరుపుకునేందుకు అంతా సిద్ధమైంది. చైత్ర శుద్ధ నవమి ఆదివారం సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని రామాలయాలు ముస్తాబయ్యాయి. వివరాలు 6లో..

## నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

ఏలూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):మునిసిపాల్టీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెలాఖరులోగా ఒకేసారి చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నెల రోజుల్లో ఆస్తి పన్ను ముందుగా చెల్లిస్తే రాయితీ ఇచ్చేలా పదేళ్లుగా ఈ విధానం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ విధంగా చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం మునిసిపాల్టీలకు సంబంధించిన సర్వర్లు డౌన్‌లో ఉన్న నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి పనిచేస్తుంది. అప్పటి నుంచి ఆస్తి పన్ను డిమాండ్‌లు జారీ కానున్నాయి. ఈ మేరకు మునిసిపాలిటీల వారీగా అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు.

# ఆ సెల్‌ఫోన్‌లు భద్రమేనా..?



## వలంటీర్ల నుంచి స్వాధీనం చేసుకుని ఏడాది

- పశ్చిమలో 8,280, ఏలూరు జిల్లాలో 9,500 స్వాధీనం..
- జడ్పీ, రెవెన్యూ కార్యాలయాల్లో భద్రపరిచామంటున్న అధికారులు
- కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన వైసీపీ సర్కార్..
- ఏడాదిగా వాటి వినియోగంపై ఏ నిర్ణయం తీసుకోని అధికారులు
- ఇప్పుడవి పనికి వచ్చేనా?

ఏలూరు సిటీ/భీమవరం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కార్ హయాంలో వలంటీర్లు వినియోగించిన సెల్‌ఫోన్‌లను ఏం చేశారు ? ఎన్నికల ముందు స్వాధీనం చేసుకున్న వీటిని భద్రంగానే ఉంచారా ? వాడకానికి ఇవి తిరిగి పనికి వస్తాయా ? పనిచేస్తే ఏం చేయబోతున్నారు ? కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వీటిని ఏడాది కాలంగా అలా వృథాగా వదిలేయడం వెనుక కారణం ఏమిటి ? ఈ ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పాలి.


వైసీపీ సర్కార్ హయాంలో వేల రూపాయల విలువైన అండ్రాయిడ్ ఫోన్‌ను కొనుగోలు చేసి వలంటీర్లకు అందజేసింది. వీటి ద్వారా క్షేత్రస్థాయిలో పథకాలకు అర్హులను, అనర్హుల డేటాను సేకరించింది. వివిధ రకాల సర్వేలు చేయించింది. రేషన్ పంపిణీ మొదలుకొని ధాన్యం సేకరణ, ఇతర సబ్సిడీలు, డీబీటీ పథకాలకు వీటి వినియోగించింది. లబ్ధిదారులకు ఏ పథకం అమలు చేయాలన్నా ఫోన్‌ల ద్వారానే తెలిసేది. ఒక్కో ఫోన్‌లో ఆ వలంటీర్ పరిధిలోని 50 కుటుంబాల సమాచారం నిక్షిప్తమై ఉండేది. ఈ లెక్కన ఏలూరు జిల్లాలో 10 వేల 400 మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో తొమ్మిది వేల 200 మంది వలంటీర్లు ఉన్నారు. వీరందరికి ఫోన్‌లు పంపిణీ చేసింది. అయితే గత ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశించింది. వారి వద్ద వున్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ఏలూరు జిల్లాలోని 9,500 మంది వలంటీర్లు సెల్‌ఫోన్‌లను సంబంధిత ఎంపీడీవోలకు అందజేశారు. వీటినన్నింటిని వారు సీల్డ్ ప్యాక్‌లో జిల్లా పరిషత్‌కు పంపించారు. వాటిని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. పశ్చిమ గోదావరి జిల్లాలో తొమ్మిది వేల 200 మంది ఫోన్‌లు తీసుకుని రాగా అందులో పది శాతం వరకు పాడవడంతో సుమారు 8,280 ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సంబంధిత ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక పెట్టెలో భద్రపరిచారు. ఇదే విషయాన్ని ఆయా జిల్లాల అధికారులు ధ్రువీకరిస్తున్నారు.

### వేల ఫోన్లు నిరుపయోగం

రెండు జిల్లాల్లోను లక్షల విలువైన 17 వేల 780 ఫోన్‌లను ఏడాది కాలంగా వినియోగించకుండా పెట్టెల్లో భద్రపరిచారు. ఒక్క మన జిల్లాల్లోనే ఇన్ని వుంటే రాష్ట్రం మొత్తం మీద రెండు లక్షలకుపైనే ఉంటాయి. వీటిని వినియోగించకపోవడంతో వాటి పరిస్థితి ఏమిటనేది చూస్తేనే కాని తెలియదు. ఇప్పటి వరకు వినియోగంలో లేని ఈ ఫోన్‌లపై ప్రభుత్వం ఒక స్పష్టత ఇవ్వాల్సిన అవసరం వుంది. లేకుంటే కోట్ల రూపాయలు వృథా అయినట్లే..! ఇప్పుడు ఇదే చర్చనీయాంశంగా మారింది.

# 16న కాల్వల మూసివేత

- జూన్ 1న తిరిగి విడుదల చేసే అవకాశం.. రబీకి నీటి ఇబ్బంది లేదంటున్న అధికారులు
- ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.5 అడుగులు



రాజమహేంద్రవరం/భీమవరం టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజి నుంచి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు నీటిని తీసుకుని వెళ్లే డెల్టా కాలువలను ఈ నెల 16న మూసివేయనున్నారు. ఏటా సమ్మర్‌లో క్లోజర్ సమయం కింద కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేసి, కాల్వల్లో సిల్ట్, తూడు తొలగింపు, ఇతర అభివృద్ధి పనులు చేస్తుంటారు. రబీ ముగిసిన తర్వాత, మంచినీటి అవసరాలకు నీటిని ఇచ్చి మూసేస్తుంటారు. తిరిగి జూన్ 1న తెరిచే అవకాశం ఉంది. ఈ ఏడాది రబీలో శివారు, మెరక ప్రాంతాలలో కొంత వరకూ నీటిఎద్దడి ఎదురైంది. వంతుల వారీ విధానం పాటించడం వల్ల పెద్దగా సమస్య లేదని అధికారులు చెబుతున్నారు. కాని శివారు ప్రాంతాల్లోని కొన్ని చోట్ల నీటి సమస్య ఎదురైంది. సాధారణంగా రబీ సీజన్‌తోపాటు మంచినీటి అవసరాలు, చెరువుల కోసం 120 టీఎంసీల వరకూ అంచనా వేస్తారు. ఇప్పటి వరకూ 103 టీఎంసీలు నీటిని వాడారు. 11,300 క్యూసెక్కుల నీటిని ఒక టీఎంసీగా పరిగణిస్తారు. మరో పది రోజులపాటు కాల్వలకు నీరు ఇస్తారు కాబట్టి, ఈలోపు పంట అవసరాలు, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకు అవసరమైన నీటిని వినియోగించుకోవాలి. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్లు, జేసీలు సంబంధి అధికారులను స్పష్టం చేశారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పు డెల్టాలో 2,64,533 ఎకరా లు,సెంట్రల్ డెల్టాలో లక్షా 72 వేల ఎకరాలు, పశ్చిమ డెల్టాలో నాలుగు లక్షల 60 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రబీ సీజన్ డిసెంబర్‌లో మొదలైంది. పూర్తిగా నాట్లు పడేసరికి జనవరి దాటేసింది. ఈ నేపథ్యంలో కొంత నీటి సమస్య ఉంది. వాస్తవానికి నవంబర్ 1న రబీ సీజన్ మొదలయ్యేటట్టు ప్లానింగ్ ఉంటే రబీకి నీటి సమస్య ఉండదు. ప్రస్తు తం సీలేరు నుంచి ఎనిమిది వేల క్యూసె క్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం తూర్పు డెల్టాకు మూడు వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు రెండు వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పోలవరం స్పిల్‌వే వద్ద సుమారు 20 టీఎంసీల వరకూ నీరు ఉన్న ట్టు చెబుతున్నారు. దీనితో ఈ సీజన్‌కు పెద్దగా నీటి సమస్య ఉండదని ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. ధవళేశ్వరం బ్యారే జీ నీటిమట్టం ప్రస్తుతం 9.5 అడుగులు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 6.05 అడుగులు మాత్రమే ఉంది. గత ఏడాదికంటే బాగుంది. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 4114 టీఎంసీలు సముద్రం పాలైంది.

## 'ట్రంప్ సుంకాలను చూపి రొయ్యల రైతులను ముంచేస్తున్నారు'

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):అమెరికా విధించిన ప్రతీకార సుంకాలను అస్త్రంగా తీసుకుని ఈ ప్రాంతంలో రొయ్యల కొనుగోలు కేంద్రాలు రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నాయని పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు ధ్వజమెత్తారు. శనివారం ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్లాది రూపాయలు దండుకునే దురుద్దేశంతో మూడు రోజులుగా రైతుల నుంచి ఆక్వా ఉత్పత్తులు కొనుగోలు చేయడం లేదని వాపోయారు. ఆక్వా రైతుల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించకుంటే సాగు మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. తమ సమస్యలపై సోమవారం పాలకొల్లులో రైతు మహాసభను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. దీనికి ఆక్వా రైతులు, వ్యాపారులు, కార్మికులు హాజరు కావాలని కోరారు. వైస్ చైర్మన్ పెన్మెత్స సత్య నారాయణరాజు పాల్గొన్నారు.



నీరు లేక ఎండిపోయిన ఆటపాక పక్షుల కేంద్రం చెరువు

# బోటు షికారుకు బ్రేక్

## పక్షుల కేంద్రంలో అడుగంటిన నీరు



కైకలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విదేశీ వలస పక్షులతో ఆతిథ్యం ఇస్తున్న ఆటపాక పక్షుల కేంద్రానికి నిర్లక్ష్యపు జబ్బు పట్టి పీడిస్తోంది. గత వర్షాకాలంలో కొల్లేరు వరదలు ముంచెత్తినా పక్షుల కేంద్రంలో నీటి నిల్వలను పెంచేందుకు ఏ చర్యలు చేపట్టకపోవడంతో నీరు అడుగంటి బోటు షికారును రెండు రోజులు నుంచి నిలిపివేశారు. పక్షుల కేంద్రానికి కేటాయించిన 310 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉండగా ఈ ఏడాది ఎక్కడా మోటర్లతో చెరువు నింపిన దాఖలాలు లేవు. ప్రస్తుతం నీరు లేక బోటుషికారు నిలిపివేయడంతో పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఏప్రిల్ మొదటి వారానికే నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో పక్షులకు మేత కూడా కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పక్షుల కేంద్రానికి సమీపాన పోల్‌రాజ్ డ్రెయిన్ కాల్వ నుంచి తూముల ద్వారా, ఇంజన్ల ద్వారా చెరువులోకి నీరు నింపాల్సి ఉన్న పట్టించుకో లేదు. చెరువుగట్లు బలహీనంగా ఉండడం వలనే నీరు నిల్వ ఉండడం లేదని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్న గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా పర్యాటక కేంద్ర అభివృద్ధి ఖర్చు చేయకపోవడంతో ఈ దుస్థితి వచ్చిందంటూ పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

### ఈ వేసవిలోనైనా అభివృద్ధి జరిగేనా...

ఆటపాక పక్షుల కేంద్రం చెరువు ఈ వేసవిలోనైనా అభివృద్ధి పనులు చేపడతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా వేసవిలో చెరువు ఎండిపోతున్నా ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదు. ఇటీవల పక్షుల కేంద్రాన్ని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి సందర్శించారు. ఈ సంవత్సరం పక్షుల కేంద్రం గట్లను మరింత పటిష్ఠం చేసి పక్షుల ఆవాసా కేంద్రాలను మరిన్నీ ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన సందర్శించి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం స్వల్పంగా నీరు ఉన్నందున మరి కొద్దిరోజుల్లో ఎండవేడికి పూర్తిగా అడుగంటిపోతుంది. ఈ వేసవిని అటవీ శాఖ అధికారులు ఏ మేరకు సద్వినియోగం చేసుకొని పక్షుల కేంద్రం గట్లును బలోపేతం చేస్తారో వేచి చూడాల్సిందే.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ తొలిప్రధానిగా సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ కృషి చేశారని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఆయన కాంస్యవిగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలు ఈ తరానికి ఆదర్శమన్నారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జుంజు మోజేష్, నేతర అజయ్‌బాబు, డాక్టర్ మెండెం సంతోశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వడాలిలో రూ.8 లక్షల విలువైన నగలు అపహరణ

■ లోపలి పేజీలో..



# జై శ్రీరామ్

## రాములోరి కల్యాణానికి ఆలయాలు ముస్తాబు



శ్రీ రామ నవమి పండుగ ఆదివారం పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. చలువ పందిళ్లు, తాత్కాలిక టెంట్లు వేసి, దేవాలయాలను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ కాంతులు వెదజల్లుతున్నాయి. మామిడి తోరణాలు, కాషాయి తోరణాలతో ఆలయాలను విశేషంగా అలంకరించారు. పలుచోట్ల కల్యాణ శుభలేఖలతో సీతారాముల కల్యాణ మహోత్సవానికి విచ్చేయాలని ఆహ్వానించారు. స్వస్తిశ్రీ చాంద్రమాన విశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి పుష్యమి పునర్వసు నక్షత్ర మిధున లగ్నంలో అయోధ్య నగరాధీశులైన శ్రీదశరథ మహారాజు జ్యేష్ఠపుత్రుడు శ్రీరామచంద్రమూర్తికి మిథిలాపుర నగరాధీశులైన జనక మహారాజు ఏకైక పుత్రిక సీతా మహాదేవికి ఇచ్చి వివాహం జరిపిస్తున్నట్టు ఆహ్వాన పత్రికల్లో పేర్కొన్నారు.

## బైరాగిమఠంలో ఒడిశా సంప్రదాయ పూజలు



బైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయం

ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెంటపాడు : 18వ శతాబ్దంలో ఒడిశా బ్రహ్మచారులతో పెంటపాడు మండలం బైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభించారు. అప్పట్లో దూరప్రాంతాల నుంచి కాశీ వెళ్లే భక్తులు ఈ మఠంలో బస చేసేవారు. వీరి భోజన వసతుల కోసం రాజావెంకట అప్పారావు అనే జమిందారు 10 పుట్లు (సుమారు 100 ఎకరాలు) భూమిని ఈ ఆలయానికి దానం చేశారు. ఒడిశా బ్రహ్మచారులతో ఈ మఠం కొనసాగడంతో ఇప్పటికి ఒడిశా సంప్రదాయంలోనే ఆలయంలో పూజలు జరుగుతాయి. ఈ ఆలయంలో కృష్ణుడు బాలకృష్ణుని రూపంలో ఇక్కడ దర్శనమిస్తాడు. భద్రాచలంలో సీతారాముల కల్యాణ ముహూర్తానికే ఇక్కడ రాములోరి కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల ఆరో తేదీ మధ్యాహ్నం కల్యాణం అనంతరం పది వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. నాలుగు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా 7వ తేదీన రథోత్సవం. 8న తెప్పోత్సవం, 9న స్వామికి చక్రస్నానం, శ్రీపుష్పయాగం పూజలు చేస్తారు. ఆలయ ఫిట్ పర్సన్ బీవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

## 105 ఏళ్ల నాటి కోదండ రామాలయం



సరిపల్లెలో కోదండ రామాలయం



భక్తుల పూజలు

గణపవరం : సరిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో 105 ఏళ్ల నాటి కోదాండ రామాలయం ఉంది. నూజివీడు సంస్థానంలోని విశాఖపట్నం సమీపంలోని యలమంచిలి గ్రామస్థులు ఈమని వెంకటేశ్వర్లు 1918లో గణపవరం మండలం తానాకు మేనేజర్‌గా వచ్చారు. ఆయన సరిపల్లెలో నివాసం ఉంటూ ఈ ప్రాంత పరిపాలన చూసేవారు. ఆ సంస్థానంలో కొందరు ఉన్నతాధికారులతో ఇమడలేక రాజీనామా చేశారు. అప్పటినుంచి తన శేష జీవితాన్ని హిందూ ధర్మప్రచారాన్ని ప్రారంభించారు. అప్పట్లో సరిపల్లె మొకాసదారులైన క్రొవ్విడి వంశస్థుల సహకారంతో 14 ఎకరాల స్థలాన్ని సేకరించారు. 1921లో కోదండరామాలయం, గోశాల, తదితర ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయన మరణానంతరం శిథిలావస్థకు చేరిన రామాలయం మాత్రం అనాటి వైభవానికి ప్రతీకగా నేటికి నిలిచి ఉంది. స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం నేతృత్వంలో ఆదివారం సీతారాముల స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు నిత్య అన్నసమారాధన దాతల సహకారంతో నిర్వహిస్తారు.

## తూర్పుయడవల్లిలో నేడు కల్యాణం

ద్వారకాతిరుమల : చినవెంకన్న క్షేత్ర దత్తత దేవాలయమైన తూర్పు యడవల్లిలోని సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో వసంత నవరాత్రోత్సవ ప్రయుక్త శ్రీరామనవమి ఉత్సవాలు కడు రమణీయంగా జరుగుతున్నాయి.. చినభద్రాద్రిగా పేరొందిన ఆలయంలో ఆదివారం రాములోరి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం జరుగుతుంది. కల్యాణం రోజు ఉదయం ఆరు నుంచి ఎనిమది గంటల వరకు సుందరకాండ ప్రయుక్త సంక్షేపరామాయణ హోమం జరుగుతుందని దీనిలో పాల్గొనే దంపతులు రూ.1,116 చెల్లించి పాల్గొనవచ్చన్నారు. ఈ సందర్భంగా శనివారం అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం పది గంటలకు శ్రీరామసామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు.

### ఆలయ చరిత్ర ఇలా..



తూర్పు యడవల్లిలో సీతారామచంద్రస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) దివ్యమూర్తులు

చిన్ని కృష్ణుని శిల్పం

ఈ ఆలయాన్ని ఎకరం విస్తీర్ణంలో శిల్పకళా సౌందర్యాలతో కోటి రూపాయలను వెచ్చించి నిర్మించారు. 52 అడుగుల ఎత్తుతో ప్రధాన గోపురం, 14 అడుగుల ఎత్తుతో సింహ ద్వారాన్ని నిర్మించడం విశేషం. ఆలయ ముఖ మండపంలో శిల్పకళా సౌందర్యాలతోపాటు మేషం నుంచి మీనం వరకూ 12 రాశులు, ముద్దు గొలిపే చిన్ని కృష్ణుని శిల్పం, పర్ణశాల ఆలయానికి మరింతగా వన్నె తెస్తున్నాయి. దీన్ని అప్పటి మంత్రి కోటగిరి విద్యాధరరావు దంపతుల కృషితో చినజీయర్‌స్వామి విగ్రహ ప్రతిష్ట చేయగా 2003లో శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని అన్ని కైంకర్యాలను, ఉత్సవాలను నిర్వహిస్తూ అభివృద్ధి చేస్తున్నారు.

## 300 ఏళ్ల నాటి పెద రామాలయం



రాముడి కాలుపై కూర్చున్న సీతమ్మ విగ్రహం

ముదినేపల్లి : ముదినేపల్లి సీతారామ స్వామి(పెద రామాలయం) ఆలయం సుమారు 300 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ ఆలయంలో భద్రాచలం ఆలయంలోని విగ్రహాల మాదిరిగా శ్రీరాముడి ఎడమ కాలుపై సీతమ్మ అమ్మవారు కూర్చున్న విగ్రహాలను ఏర్పాటుచేశారు. సాధారణంగా లక్ష్మణుడు, ఆంజనేయస్వామితో కలిసి రామాలయాల్లో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. కాని ముదినేపల్లి సీతారామ స్వామి ఆలయంలో మాత్రం లక్ష్మణుడు, ఆంజనేయుడు లేకుండానే సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించడం అప్పట్లో విశేషంగా చెప్పుకునే వారట. 1983లో లక్ష్మణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎదురుగా నిర్మించిన మందిరంలో ఆంజనేయుడి విగ్రహం ఉంది.

## సిద్ధాపురం మరో భద్రాద్రి



కోదండ రామచంద్రమూర్తి

ఆకివీడురూరల్ : సిద్ధాపురంలో కోదండ రామాలయాన్ని మరో భద్రాద్రిగా పిలుస్తారు. భద్రాచలంలో ఏ విధగా ఆలయం ఉంటుందో అదేవిధంగా ఇక్కడ పశ్చిమ ముఖంగా ఆలయం ఉంటుందని, కంచి కామకోటిపీఠం ఆధ్వర్యంలో ఈ ఆలయం కార్యక్రమాలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన సిద్ధుడు యోగీంద్రబాబు ఈ ఆలయాన్ని నిర్మించడానికి రూపకల్పన చేసినట్లు చెబుతారు. శ్రీరామనవమి, ధనుర్మాసం పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

## తేతలిలో వైకుంఠ, మీసాల రాముడిగా..



మీసాల రామునిగా.. వైకుంఠ స్వామిగా..

తణుకు రూరల్ : తేతలి సీతారామస్వామి ఆలయంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. భద్రాచలంలో ఉన్న రీతిలో ఇక్కడి స్వామి వైకుంఠ రామునిగా, మీసాల రామునిగా దర్శనమిస్తారు. ఈ ఆలయ నిర్మాణం వెనుక పెద్ద చరిత్రే వుంది. 200 ఏళ్ల క్రితం ఓ భక్తుడి కుటుంబం భద్రాచలం వెళుతుండగా మార్గమధ్యలో తాడువాయి ప్రాంతంలోని ఒక చెట్టు వద్ద విశ్రాంతి తీసుకున్నాడు. అక్కడ రాముడి విగ్రహాన్ని చూసి, దానిని అక్కడ చెట్టు తొర్రలో భద్రపర్చి భద్రాచలం వెళ్లి శ్రీరాముడిని దర్శించుకున్నాడు. అనంతరం తిరిగి వచ్చేటప్పుడు ఆ విగ్రహాన్ని తేతలి తీసుకు వచ్చి ఇక్కడ ఆలయాన్ని నిర్మించాడు. అప్పటి నుంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్తగా తేతలి శ్రీనివాస శివరామచంద్రరావు, లక్ష్మీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు.

## పాలమూరులో వందేళ్లుగా రథోత్సవం



పాలమూరులో రథోత్సవం (ఫైల్)

పెనమంత్ర : పాలమూరులో శ్రీరామ నవమిని విభిన్నంగా నిర్వహిస్తారు. ప్రతి చోటా కల్యాణాలు నిర్వహిస్తే.. ఇక్కడ కల్యాణంతోపాటు రథోత్సవాన్ని నిర్వహించడం ప్రత్యేకత. 1920లో అప్పటి గ్రామ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వంగలవారి వీధిలో రామమందిరంతోపాటు 25 అడుగుల రథాన్ని తయారు చేయించారు. శ్రీరామ నవమికి సీతారాముల కల్యాణం నిర్వహించి రథోత్సవం నిర్వహించడం నాలుగు తరాలుగా కొనసాగుతూ వస్తోంది. ఉద్యోగ రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో వున్న బ్రాహ్మణ కుటుంబాలన్నీ శ్రీరామ నవమికి తప్పనిసరిగా వచ్చి కల్యాణం, రథోత్సవంలో పాల్గొంటాయి. 1998లో పెంకుటింటిలో ఉన్న రామ మందిరం జీర్ణోద్ధరణకు చేయడంతో ప్రస్తుత బ్రాహ్మణ సంఘం కొత్తగా ఆలయ నిర్మాణం చేశారు. ఈ ఏడాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

## రాముడి పాత్రల్లో 'షణ్ముఖి' మమేకం..



శ్రీరాముడి పాత్రల్లో షణ్ముఖి విజయకుమార్ రాజు

తణుకు : రాముడి పాత్రల్లో షణ్ముఖి విజయకుమార్‌రాజు ప్రేక్షకులను మైమరిపించి అలరిస్తారు. మొదటిసారి శ్రీకృష్ణరాయబారంలో శ్రీకృష్ణుడిగా పాలంగి కనకదుర్గ అమ్మవారి ప్రాంగణంలో భీష్మ ఏకాదశి రోజున 2000 సంవత్సరంలో రంగ ప్రవేశం చేశారు. రెండో నాటక ప్రదర్శన శ్రీ రామాంజనేయ యుద్ధం శ్రీరాముడిగా కలియుగ ఆంజనేయ బిరుదాంకితుడు సంపత్‌నగర్ లక్ష్మణరావు సరసన దీటైన శ్రీరాముడి వేషధారణలో అలరించారు. రాముడి పాత్రల్లో వేసిన పలు నాటకాలు మంచి పేరును తెచ్చిపెట్టాయని ఆయన తెలిపారు.

## గోదారమ్మతో 'రాముడి' అనుబంధం

▸ గోదావరి నదీ తీరం పొడవునా రామాయణ ఘట్టాల ఆనవాళ్లు

పోలవరం : 'రామా అందరి బంధువయా.. భద్రాచల రామయ్యా ఆదుకునే ప్రభువయ్యా మా అయోధ్య రామయ్యా' అంటూ 'దేవుళ్లు' సినిమా పాట చిత్రీకరణ చేసింది పోలవరం గోదావరి నది ఒడ్డునే. ఆ సినిమా విడుదలై 25 ఏళ్లయింది. కరాటం రాంబాబు నిర్మాణ సారథ్యంలో కోడి రామకృష్ణ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం అన్ని వర్గాల నుంచి కలెక్షన్ల వర్షం కురిపించింది. 2006లో గోదావరి నదీతీరం వెంబడి ఉన్న రామయ్యపేట పట్టిసీమ భద్రాచలం పోలవరం గ్రామాలలో అక్కినేని నాగార్జున అక్కినేని నాగేశ్వరరావులతో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు నిర్మించిన 'శ్రీరామదాసు' సినిమా అన్ని వర్గాల వారిని అలరించింది. ఈ చిత్రంలో 'ఏటయ్యిందే గోదారమ్మ ఎందుకు ఉలికి పాటు గగురు పాటు' అంటూ పాట పట్టిసీమ ఫెర్రీ రేవులో చిత్రీకరించారు. 1978లో దివంగత నందమూరి తారక రామారావు స్వీయ దర్శకత్వంలో రామకృష్ణ మూవీస్ బ్యానర్‌లో నిర్మించిన 'శ్రీరామ పట్టాభిషేకం' సినిమా పోలవరం మండలం రామయ్యపేట, పూడిపల్లి గోదావరి నది మధ్యలో వున్న మహానందీశ్వర స్వామి ఆలయ పరిసరాలలో నిర్మించారు. మరిన్ని సినిమాలు నదీ తీరంలో తీశారు.

వీఆర్‌పురం సమీపంలో ఉన్న శ్రీరామగిరి పుణ్యక్షేత్రం వద్ద వెలసిన సుందర సీతారాముల పుణ్యక్షేత్రం, ఎత్తైన కొండలపై 170 మెట్లు ఎక్కిన తర్వాత 500 ఏళ్ల క్రితం మాతంగి మహర్షిచే ప్రతిష్ఠించబడిన సీతారామ లక్ష్మణ ఆంజనేయుల సుందర విగ్రహాలు, వాలి సుగ్రీవుల కొండల సమీపంలో రెక్కలు తెగిపడిన జటాయువు పక్షి పడిన ఆనవాళ్ళు చొక్క నపల్లి గోదావరి రేవులో కనిపిస్తాయి. అక్కడే శ్రీరాముడు జటాయువుకి పిండప్రదానం చేశారని పురాణాలు చెబుతున్నాయి.



పూడిపల్లిలో 'శ్రీరామ పట్టాభిషేకం' చిత్రీకరణలో కైకాల సత్యనారాయణ, ఎన్టీఆర్

## దళితులు, గిరిజనులే.. పూజారులు



జనార్దనవరం దళితవాడలో రామాలయం

చాట్రాయి : చాట్రాయి మండలంలో దళితులు, గిరిజనులకు ఆరుచోట్ల ప్రత్యేక రామాలయాలు ఉన్నాయి. జనార్దనవరం మాలపల్లి దళితవాడ, తుమ్మగూడెం చదలవాడ, పోతనపల్లి పడమర లంబాడి తండా, తూర్పు లంబాడి తండా, మర్రి బంధం, నాయకులగూడెంలలో రామాలయాలు ఉన్నాయి. ఆదివారం ఈ ఆలయాల్లో సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయాల నిర్వహణ, ఉత్సవాలు, కల్యాణం దళితులు, గిరిజనులే నిర్వహించడం ఆచారం. ఈ ఆలయాల్లో నిత్య కైంకర్యాలు చేసేది దళితులు, గిరిజనులే కావటం విశేషం. ఈ ఆలయాల్లో పనిచేసే పూజారులకు తిరుమల తిరుపతి దేవస్థానం శిక్షణ కూడా ఇచ్చింది.

---

## శ్రీవారి క్షేత్రం రద్దీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధి శనివారం భక్తులతో కళకళలాడింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. అన్ని విభాగాలు భక్తులతో సందడిగా మారాయి. వేలాది మంది యాత్రికులు క్షేత్రానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 15 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేశార.



శ్రీవారి ఆలయ తూర్పు రాజ గోపుర సమీపంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో స్వామి

## నేత్రపర్వంగా శివకల్యాణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతున్న శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం శని వారం నేత్రపర్వంగా జరిగింది. లోక కల్యాణార్థం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ కల్యాణం నిర్వహించారు. నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి మాంగల్య ధారణ, తలంబ్రాలు మేళతాళాలు, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు.



ఆలయం సమీపంలో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనదారులు

## రాట్నాలమ్మ సన్నిధిలో ట్రాఫిక్ ఇక్కట్లు

### రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్.. భక్తులకు ఇబ్బందులు

పెదవేగి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంటలోని శ్రీరాట్నాలమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి వచ్చే భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుని నరక యాతన అనుభవిస్తున్నారు. అటు అధికారులు, ఇటు పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఫలితం కనిపించడం లేదు. శ్రీరాట్నాలమ్మ ఆలయానికి ప్రతి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చి, అమ్మవారికి మొక్కులు చెల్లించి, అక్కడే భోజనాలు చేసి వెళ్లడం ఆనవాయితీ. ఈ ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గతంలోనే రహదారిని మరింత వెడల్పు చేయించారు. రోడ్డుపైనే వాహనాలను పార్క్ చేయడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఈవో ఎన్.సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను తగ్గించే విషయంలో ఆయా ప్రాంతాల్లో ప్రైవేట్ షెడ్ల నిర్వహణదారులకు నోటీసులిచ్చి, పార్కింగ్ సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు.



## క్రీడాకారిణి జెస్సీరాజ్‌కు సీఎం ప్రశంసలు

దెందులూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అతిచిన్న వయస్సులోనే దేశ అత్యుత్తమ ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు గ్రహీత, ప్రపంచ స్కేటర్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ క్రీడా నైపుణ్యం, పట్టుదల, నిరంతర సాధన అభినందనీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఇటీవల తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ తైవాన్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల్లో చాంపియన్ షిప్‌లో రెండు గోల్డ్ మోడల్‌లు, ఒక బ్రాంజ్ మెడల్‌ను ఆమె గెలుచుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడును ఆమెతో పాటు దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన ఆమె తల్లిదండ్రులు మాత్రపు సురేష్, రాధా దంపతులు, ఆమె సోదరుడు జోయల్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసింది, ఆమెను సీఎం ప్రశంసించి మాట్లాడారు. ఈ ఏడాది జూలై 17 నుంచి 29 తేదీ వరకు దక్షణ కొరియాలో జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్‌లోను పతకాలు సాధించి ఏపీ ఖ్యాతిని మరింత చాటాలని ఆశీర్వదించారు. ఆమెకు శిక్షణ ఇస్తున్న స్కేటర్ కోచ్ సింహాద్రిని ప్రత్యేకంగా అభినందించారు,

## 500 రామాలయాలకు 8 టన్నుల బెల్లం

పెదవేగి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : 'సుపరిపాలనకు నిదర్శనం రామ రాజ్యం.. జగన్‌రెడ్డి అరాచకపాలన నుంచి విముక్తి కలిగినందుకు ఈ ఏడాది శ్రీరామనవమి ప్రత్యేకమైనది' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలో ఉన్న 500 రామాలయాల్లో పానకం తయారీకి అవసరమైన ఎనిమిది టన్నుల బెల్లాన్ని ఉచితంగా ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, మంచినేని శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు, లావేటి శ్రీనివాస్, తలకొండ జమలయ్య, పరసా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో బెల్లం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



కోళ్లపర్రు నుంచి భద్రాచలానికి భక్తుల పాదయాత్ర

## భద్రాచలానికి కోళ్లపర్రు భక్తుల పాదయాత్ర

ఆకివీడు రూరల్ : కోళ్లపర్రు గ్రామం నుంచి ప్రతి ఏటా భక్తులు భద్రాచలనాకి పాదయాత్రగా తరలి వెళుతున్నారు. నాలుగేళ్లగా గ్రామంలోని యండపల్లి రామారావు భక్త బృందం సుమారు 45 మంది పాదయాత్రగా వెళ్లి స్వామిని దర్శించుకుని తిరిగి వస్తున్నారు. ఈ బృందంలో మహిళలు ఉండడం విశేషం. ఏటా పాదయాత్రకు వెళ్లే భక్తులు సంఖ్య పెరుగుతున్నారని, మొదటి ఏడాది 30 మందితో ప్రారంభించి ప్రస్తుతం 45 మంది వరకు వెళ్లివస్తున్నామని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహార పదార్థాల వాహనంతో 240 కిలోమీటర్లు దూరం వున్న భద్రాచలం ఏడు రోజుల్లో చేరుకుంటామన్నారు.



# చింతలపూడిలో గాలి..వాన

## విరిగిపడిన చెట్లు



సుప్రియన్‌పేటలో ఇంటిపై కూలిన చెట్లు

చింతలపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీ, పరిసర గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం సుడిగాలితో కూడిన అకాల వర్షం పడింది. సుమారు గంటకుపైగా గాలి వానతో పలుచోట్ల చెట్లు కూలి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. రత్నాథియేటర్ సమీపంలోను, మారుతీనగర్‌లోని ఏలూరు రోడ్డుపై పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. సుప్రియన్‌పేటలోని ముగ్గురికి గాలికి చెట్లు విరిగిపడడంతో గాయాలయ్యాయి. దీంతో వీరిని చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏలూరు రోడ్డుపై పడిన చెట్లను ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు, ఎస్ఐ కుటుంబరావు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పలుచోట్ల గాలికి రేకుల షెడ్లు లేచి భయానక వాతావరణం కలిగించింది. జోరుగా కురిసిన అకాల వర్షానికి వాతావరణం కూడా చల్లబడడంతో జనం సేదతీరారు.

# జువ్వలపాలెంలో కలకలం

## చిరుతను పోలిన జంతువు సంచారం



చెట్లపై నుంచి దూకుతున్న జంతువు



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణ శివారు జువ్వలపాలెంలో చిరుత సంచారంపై పుకార్లు స్థానికులను భయపెట్టాయి. జువ్వలపాలెంలోని నిర్మానుష్య ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఓ వీధి కుక్కపై దాడిచేసి చంపినట్టు బయట పడింది. అయితే అదే ప్రాంతంలో శనివారం వీధికుక్కలు ఓ చెట్టు కింద చేరి అరుస్తుండటంతో స్థానికులు అక్కడ పరిశీలించగా చిరుతను పోలిన ఓ వింత జంతువు చెట్టుపై చేరి వింత శబ్దాలు చేస్తుండటం గుర్తించారు. ఆ వింత జంతువును స్థానికులు వీడియో తీశారు. అక్కడ స్థానికులు చేసిన హడావుడికి ఆ వింత జంతువు పరారైంది. ఆ వింత జంతువు వీడియో వైరల్ కావడం, వింత జంతువు చిరుతే అనే వార్త కలకలం సృష్టించింది. అయితే అది చిరుత కాదని చిరుతను పోలిఉన్న బావురుపిల్లి లాంటి జంతువు అని భావిస్తున్నారు.

## వేర్వేరుగా మార్కులు చూపాలని వినతి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసేటప్పుడు సైన్సు సబ్జెక్టుకు సంబంధించి ఒకే సబ్జెక్టుగా మార్కులను ప్రకటించడానికి బదులుగా ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సుల్లో విద్యార్థులు సాధించిన మార్కులను వేర్వేరుగా పేర్కొంటూ విడుదల చేయాలని పెదపాడు మండలం వసంతవాడ జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం శ్రీరామ్‌కుమార్, కొత్తూరు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు రెండు సైన్సు సబ్జెక్టుల మార్కులను విడివిడిగా టెన్త్ ఫలితాల్లో ప్రకటించేలా ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థిస్తూ విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు ఇటీవల పంపిన లేఖ నకళ్లను స్థానిక పత్రికలకు శనివారం విడుదల చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పదోతరగతి మార్కుల జాబితాలో సైన్సులో 35మార్కులు సాధిస్తే ఉత్తీర్ణతగా చూపిస్తుండటం సమంజసమైనప్పటికీ, ఇందులో పీఎస్, బీఎస్ సబ్జెక్టుల మార్కులు కలిసిఉంటున్నందున పలు సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మార్కులు ఎక్కువ వచ్చిన సందర్భాల్లో తమవల్లే వచ్చాయని ఈ రెండు సబ్జెక్టుల ఉపాధ్యాయులు చెప్పుకుంటున్నారని, అలాగే తక్కువమార్కులు వచ్చినపుడు ఎదుటివారి సబ్జెక్టే కారణంగా పేర్కొంటున్నారని వివరించారు.



భగవద్గీత పోటీల్లో శ్లోకాలు ఆలపిస్తున్న బాలలు

## రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆనంద ఫంక్షన్ హాల్లో రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలు ప్రారంభమైనట్టు ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు తెలిపారు. రెండు రోజులపాటు పోటీలు జరుగుతాయి. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల్లో పోటీలు ఉంటాయి. సబ్ జూనియర్స్ (5 నుంచి 10 సంవత్సరాల వయస్సు) 21 నుంచి 30 శ్లోకాలు, జూనియర్స్ (11 నుంచి 18 సంవత్సరాల వయసు) 51 నుంచి 70 శ్లోకాలు, మూడో విభాగం సీనియర్స్ (19 సంవత్సరాలు వయసు పైన) 76నుంచి 108 శ్లోకాలు, నాలుగో విభాగం విశిష్ట ప్రతిభా విభాగం అన్ని వయసుల వారికి మొత్తం 108 శ్లోకాలపై పోటీలను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. దాదాపు వెయ్యి మంది పోటీల్లో పాల్గొన్నారు. ఏ విభాగానికి ఆ విభాగం చొప్పున పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి 13న బహుమతులు అందిస్తామని తెలిపారు.



# రోడ్లే.. బార్‌లు!

» మోటార్ సైకిళ్లే టేబుల్స్ » రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం
» చోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ » భయభ్రాంతులకు గురవుతున్న మహిళలు



భీమవరంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారికి సీఐ కౌన్సెలింగ్



ఏలూరులో బహిరంగ మద్యపానం

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలు కాపాడడంలో పోలీస్ శాఖ తమదైన శైలిలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నది. ఇటీవల డ్రోన్ కెమెరాలతో కూడా పర్యవేక్షణ నిర్వహిస్తున్నది. అయితే ఇవేమి తమకు పట్టవన్న రీతిలో కొంత మంది మందు బాబులు యథేచ్ఛగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఉదయం అయినా మధ్యాహ్నం అయినా, సాయంత్రం అయినా అపరాత్రి, అర్ధరాత్రి ఏదైనా మాకు ఒక్కటే అన్న రీతిలో మందుబాబులు రోడ్లపైన జనవాస ప్రాంతాల్లో రోడ్లపై పార్కింగ్ చేసి మోటారు సైకిళ్ల సీట్లను తమ టేబుల్స్‌గా వినియోగిస్తూ మద్యం తాగుతున్నారు. ఆ రోడ్డు వెంబడి వెళ్లాలంటే మహిళలు భయపడుతున్నారు.

వాస్తవానికి నిబంధనల ప్రకారం లూజు విక్రయాలు చేయకూడదు. అక్కడ ఎలాంటి సిట్టింగ్ ఇవ్వకూడదు. యథేచ్ఛగా సిట్టింగ్‌లు ఇచ్చేశారు. కొన్ని మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ సరైన సిట్టింగ్‌తోపాటు తినుబండారాలు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేసుకుని ఆరుబయట మద్యం సేవిస్తున్నారు. ఇవేమి తమకు కనపడవన్నట్లుగా ఎక్సైజ్ శాఖ అధికారులు మిన్నకుండిపోయారు. మామూళ్ల మత్తులో మాకు ఏమి కనపడవు అనే రీతిలో ఆశాఖ ఉందనే విమర్శలు వస్తున్నాయి. స్కూళ్లపక్కనే ఈ మద్యం తాగుతున్నారు. ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో సెయింట్ థెరిస్సా వెనుక రోడ్డులో 24గంటలు మద్యంబాబులు తమ జాగాగా ఆరోడ్డును వినియోగిస్తున్నారు. ఒక్క ఆరోడ్డే కాదు. ఏలూరు నగరంలో ఎటు చూసినా ఇదే పరిస్థితులు కనపడుతున్నాయి. సాయంత్రం వేళ ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో దారివెంబడి వెళ్ళేవారిపై వేధింపులకు గురి చేస్తున్నారు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని వెంటపడి అడుగుతున్నారు. ఇవ్వకపోతే దుర్భాషలాడుతూ దాడులకు కూడా దిగుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లాలో పలు జరిగాయి. తాగేసిన మద్యం సీసాలను రోడ్డుపైనే బద్దలుకొట్టి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దాంతోపాటుగా పంట పొలాల్లో కూడా ఖాళీ మద్యం సీసాలను పడవేయడంతో రైతులు పొలం పనులు చేస్తూ గాయపడి ఆసుపత్రి పాలవుతున్నారు.

# ఆర్టీసీ కార్గో అవినీతిలో రూ.లక్ష రికవరీ

## సస్పెన్షన్‌లోనే ఉన్న ఉద్యోగి



నరసాపురం ఆర్టీసీ డిపో

నరసాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నరసాపురం ఆర్టీసీ కార్గో కార్యాలయంలో గత ఏడాది ఏప్రిల్‌లో వెలుగు చూసిన అవినీతిలో ఇప్పటి వరకు అధికారులు రూ.లక్ష రికవరీ చేశారు. ఇంకా రూ.50వేలు రికవరీ చేయాల్సి ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. మిగిలిన రూ.50వేలు చెల్లించిన తరువాత పోస్టింగ్ ఇస్తామని డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఏటా ఆర్టీసీ కార్గో రికార్డులను ఆడిట్ చేస్తూ ఉంటుంది. ఈక్రమంలో గత ఏడాది ఏప్రిల్‌లో ఆడిట్ చేస్తున్నప్పుడు ఆదాయం కన్నా డీజిల్ ఖర్చులు ఎక్కువగా కనిపించాయి. అనుమానం వచ్చిన అధికారులు లోతుగా తనిఖీలు చేశారు. పార్సిల్ బుకింగ్ అయిన వెంటనే సదరు సొమ్మును ఉద్యోగి రికార్డులో నమోదు చేయడం లేదు. రెండు మూడు రోజులకు ఒకసారి జమ చూపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా రూ.1.50లక్షల వరకు సొమ్ము దుర్వినియోగం చెందినట్లు ఆడిట్‌లో బయట పడింది. విచారణ అనంతరం సదరు ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఉద్యోగి నుంచి రూ.లక్ష జమ చేశారు. ఈ సంఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. అప్పటి నుంచి రసీదుకు అనుగుణంగా ఏ రోజు సొమ్మును ఆ రోజు సంస్థకు జమ చేస్తున్నారు. రికార్డులను కూడా డీఎం ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు.



ద్వారకాతిరుమల గోశాలలో పశుగణన తనిఖీ చేస్తున్న హజారికా

# 15 లోపు పశుగణన పూర్తి చేయండి

## కేంద్ర ప్రభుత్వ సలహాదారు హజారికా

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండవ రోజు కేంద్ర ప్రభుత్వ సలహాదారు (స్టాటిస్టిక్స్) జగత్ హజారికా శనివారం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని తన సిబ్బందితో కలసి దర్శించుకున్నారు. అనంతరం కొండపై ఉన్న గజశాలలో గజలక్ష్మి ఆశీర్వచనం పొందారు. ఆ తర్వాత స్వామివారి గోసంరక్షణశాలకు వెళ్లి అక్కడ పశుగణనకు సంబంధించి తనిఖీలు జరిపారు. అనంతరం మండలంలోని సూర్యచంద్రరావుపేట గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పాడిరైతులు, మేకలు, గొర్రెల పెంపకం దారుల నుంచి వివరాలు సేకరించారు. పశుగణన చేస్తున్న ఎన్యూమరేటర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశుగణన కార్యక్రమం ఈనెల 15లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టి గోవిందరాజులు, డాక్టర్ శ్రీనివాసరాజు, చందు, ఏడీ సాయి రమేష్, డాక్టర్ హర్ష, మండల పశువైద్యాధికారి అంగర సురేష్ పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘాతో పేకాటరాయుళ్లకు చెక్

» తొమ్మిది మంది అరెస్టు



ఉండి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డ్రోన్ నిఘాతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెడుతున్నట్లు ఉండి పోలీసులు తెలిపారు. శనివారం ఉండి పట్టణ శివారు నిర్మానుష్యంగా ఉండే పంటపొలాలు వద్ద పేకాట ఆడుతున్న 9మందిని డ్రోన్ సహాయంతో గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయింఆస్మి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాడులను పోలీసులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉండి ఎస్ఐ నజీరుల్లా వారి సిబ్బంది డ్రోన్ ద్వారా పేకాట ఆడుతున్న వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,390నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# తాళాలు వేసిన ఇంట్లో చోరీ

## వడాలిలోరూ.8 లక్షల విలువైన నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ వీరభద్రరావు

ముదినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తాళాలు వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.8 లక్షల విలువైన 11 కాసుల బంగారపు ఆభరణాలు, టీవీని అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. వడాలికి చెందిన బత్తుల నాగమణి భర్త ఐదేళ్ల క్రితం చనిపోగా ఆమె ఒంటరిగా ఉంటోంది. గతనెల 16న ఆమె ఆరోగ్య పరీక్షలకు గుడివాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి అక్కడ రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద ఉంది. తిరిగి శనివారం ఉదయం వడాలి రాగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడం గమనించింది. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలోని 11 కాసుల బంగారపు ఆభరణాలు, రూ.25 వేల నగదు, టీవీని ఎత్తుకుపోయినట్టు గుర్తించింది. ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు నుంచి క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. ముదినేపల్లి - భీమవరం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ఇంటిలో దొంగతనం జరగడం విశేషం. గత 20 రోజులుగా ఆ ఇంటిలో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

## ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

భీమవరం క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. ఈ నెల 2వ తేదీన నర్సయ్య అగ్రహారం నుంచి కుముదవల్లి రోడ్డులోకి బీవీ నరసింహారావు అనే వ్యక్తి వాకింగ్‌కు వెళుతున్నాడు. ఆ సమయంలో వెంకయ్యనాయుడు వీధికి చెందిన ఎల్. ఏడుకొండలు, రాయలం గ్రామానికి చెందిన సిహెచ్.రమేష్‌లు మోటార్ సైకిల్‌పై వచ్చి నరసింహారావు మెడలోని 12 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. దీంతో నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం శనివారం వారిద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

## మోటార్ సైక్లిస్టుకు గాయాలు

భీమవరం క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో ఆ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం విస్సాకోడేరు గ్రామానికి చెందిన పి.బాలసుందర్ అనే యువకుడు శనివారం ద్విచక్ర వాహనంపై హాల్ టిక్కెట్ కోసమని పట్టణానికి వస్తున్నాడు. మార్గమధ్యంలో ఓవర్ బ్రిడ్జి మీదకు వచ్చేసరికి భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళ్ళే టిప్పర్ లారీ బాలసుందర్‌ను ఢీకొంది. దీంతో అతని రెండు కాళ్ళు నుజ్జునుజ్జు అయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే స్థానికుల సహాయంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒకరి అరెస్ట్

భీమవరం క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు తెలిపారు. శనివారం గరగపర్రు రోడ్డులో గస్తీ నిర్వహిస్తుండగా బీవీ రాజు విగ్రహం సమీపంలో పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన మల్లుల భానుచంద్ర అనే వ్యక్తి ఆరు మద్యం సీసాలను తరలిస్తున్నాడు. ఈ కేసుకు సంబంధించి అతనిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సునీల్‌కుమార్, ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి

### సంపు మోటార్ సరిచేస్తుండగా ప్రమాదం



నాగదుర్గ బాలాజీ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి చెందిన ఘటన శనివారం తెలంగాణలోని స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం. ఏలూరు జిల్లా కైకలూరు మండలం వదర్లపాడుకు చెందిన బాలాజీ(27) తపాలాశాఖలో ఉద్యోగం రాగా మీదికొండలో ఆరు నెలల క్రితం బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా విధుల్లో చేరాడు. ఘన్‌పూర్ పట్టణంలోని తిరుమలనాథ స్వామి కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. స్నానం చేయడానికి వాటర్ సంపులోని విద్యుత్ మోటార్ ఆన్ చేసి నీళ్ల తోడుకునే ప్రయత్నం చేయగా నీళ్ల రాలేదు. దాంతో మోటార్ రిపేరు వచ్చి ఉంటుందని భావించిన బాలాజీ, స్విచ్ఆఫ్ చేయకుండానే సంపు వద్దకు వెళ్లి మోటార్‌ను బయటకు తీసి పట్టుకున్నాడు. దీనితో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

## మోటారు సైకిల్ ఢీకొని గుమస్తా మృతి



షైఖేల్‌రాజు (ఫైల్)

ఆకివీడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆకివీడులో చోటు చేసుకున్నది. నేతల షైఖేల్‌రాజు (42) కరీమ్ ఫిష్ ప్యాకింగ్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని రామరాజు హాస్పటల్‌లో పనిచేస్తున్న తన భార్యను ఇంటికి తీసుకెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై ఆసుపత్రికి వెళుతుండగా ఎదురుగా మోటారు బైక్‌పై నిర్లక్ష్యంగా, అతి వేగంగా వచ్చిన వచ్చిన మరో వ్యక్తి ఢీ కొట్టడంతో షైఖేల్‌రాజు అక్కడకక్కడే చనిపోయాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ బండి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఒంటరి వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఏనుగ వెంకట శివరామకృష్ణ (50) కొన్నేళ్ళ నుంచి భార్యా పిల్లలను వదిలేసి ఒంటరిగా ఉంటున్నాడు. పదేళ్ళ క్రితం సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్న అతను తిరిగి వచ్చేసి శ్రీరామ్‌నగర్ కాలనీలో ఉన్న తన తండ్రి ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నాడు. చుట్టు పక్కల వారికి దుర్గంధం రావడంతో వారిచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి వెళ్ళి పరిశీలించారు. వెంకట శివరామకృష్ణ ఆ ఇంట్లో మృతి చెంది ఉన్నాడు. ఏలూరు ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.జీవరత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిం చారు.

## డ్యూటీకి వెళ్లిన కుమారుడి అదృశ్యం

మొగల్తూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్ళిన తన కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఆయన కథనం ప్రకారం నరసాపురం మండలం గొంది గ్రామానికి చెందిన చల్లా నాగాంజనేయులు (30) మొగల్తూరులోని వర్మ మెరైన్ కంపెనీలో రెండు నెలల నుంచి పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో మెరైన్ కంపెనీ అవుట్ గేట్ వద్ద సంతకం పెట్టి బయటకు వచ్చిన నాగాంజనేయులు ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# తల్లి, ఇద్దరు పిల్లలను కాపాడిన పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తాళలేక భార్య తన పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడదామని వెళ్ళిన తరుణంలో టూటౌన్ పోలీసులు కాపాడిన ఘటన శనివారం సాయంత్రం ఏలూరు నగరంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని వాసావారి వీధికి చెందిన భార్యాభర్తలు వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఆరో తరగతి చదువుతూ ఉండగా కుమార్తె నాలుగో తరగతి చదువుతున్నది. భర్త సెల్‌ఫోన్ దుకాణాన్ని నిర్వహిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్నపాటి విభేదాలు తలెత్తాయి. విభేదాలు కాస్త పెద్దవి కావడంతో ఆమె జీవితంపై విరక్తి చెందింది. శనివారం సాయంత్రం ఆమె తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఆత్మహత్యకు పాల్పడడానికి బయలుదేరి రైల్వేస్టేషన్‌కి వెళ్ళింది. గమనించిన స్థానికులు వెంటనే 112కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు క్షణాల్లో ఘటనా స్థలానికి వెళ్ళి ఆమెతో పాటు ఇద్దరు పిల్లలను రక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇలా ఆత్మహత్యకు పాల్పడదామని బయలుదేరిన వ్యక్తులను ఇప్పటికి టూటౌన్ పోలీసులు మూడుసార్లు కాపాడారు.

# గ్రామ సంఘ నిధులు రూ.2.10లక్షలు స్వాహా

## సీసీపై ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల గ్రామ సంఘానికి సంబంధించిన నిధులను సంఘ లీడర్ల సంతకాలను ఫోర్జరీ చేసి సీసీగా పనిచేస్తున్న హసేమియా అనే వ్యక్తి స్వాహా చేసినట్లు చెబుతున్నారు. దాదాపు రూ.2.10లక్షల సొమ్మును స్వాహా చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు రికవరీ కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ద్వారకాతిరుమల డ్వాక్రా గ్రామ సంఘానికి మనుబోలు అరుణకుమారి, పెద్దింటి జయలక్ష్మి, మాచెట్టి కుమారి లీడర్లుగా ఉన్నారు. అప్పటి వరకు సీఏగా పనిచేసిన గాయత్రిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్చి వాణికి బాధ్యతలు అప్పగించారు. దీనిని అవకాశంగా తీసుకున్న హసేమియా గ్రామసంఘ చెక్కులపై పైముగ్గురు లీడర్ల సంతకాలను ఫోర్జరీ చేసి డిసెంబరు నెలలో రూ.1.20లక్షలు, జనవరి 13న రూ.90వేలు స్థానిక యూనియన్ బ్యాంకుకు చెందిన ఐదు చెక్కుల ద్వారా వేరేవారి పేరున ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామసంఘ లీడర్లు జనవరి 20నే ఏపీఎం అరవిందమ్మ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీసీ హసేమియాను పిలిచి ఏపీఎం అడగ్గా తానే వాడుకున్నానని అంగీకరించినట్లు ఏపీఎం చెప్పారని అతని నుంచి రాతపూర్వక హామీ పత్రం తీసుకున్నానని మరో వారంలో తమ అకౌంట్‌లో జమచేయిస్తానని ఏపీఎం తమకు హామీ ఇచ్చారని లీడర్లు చెబుతున్నారు. రెండునెలలు దాటుతున్నా కేవలం రూ.20వేలు జమ చేయించి తర్వాత పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రతి నెల అతని జీతం నుంచి సొమ్మును రాబడతానని చెప్పిన ఏపీఎం ఆ తర్వాత పట్టించుకోలేదు. అయితే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ విజయరాజు సీసీని సస్పెండ్ చేశారు. అయితే జనవరి 20న స్వాహా విషయం బయటకు వచ్చినా ఏపీఎం అరవిందమ్మ ఏప్రిల్ 1న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి ఆలస్యంగా తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని ఆదేశాలిచ్చారు. దీనిపై ఏపీఎం వివరణ ఇస్తూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీసీ హసేమియాపై ఫిర్యాదు చేశానన్నారు. ఇతను పనిచేసిన అన్ని మండలాల్లోనూ ఇలానే చేస్తూ జీతం నుంచి సొమ్మును జమచేస్తున్నాడని తెలిపారు. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని గ్రామసంఘ లీడర్లు కోరుతున్నారు.

## భార్య మందలించిందని ఎలుకల మందు తాగి ఆత్మహత్య

కలిదిండి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పడమటిపాలెం గ్రామానికి చెందిన కొట్టి శ్రీనివాసరావు (35) ఈ నెల 3న మద్యం తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా భార్య మద్యం మానేయాలని మందలించింది. దీంతో అతను మనస్థాపానికి గురై ఈ నెల 4న ఎలుకల మందును నీళ్లలో కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అకాల వర్షానికి రైతులు విలవిల

లింగపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం అకాల వర్షానికి పొగాకు, వరి, మొక్కజొన్న, మిర్చి రైతులు విలవిలలాడారు. ఆరుగాలం పండించిన పంట కళ్ల ముందే తడిచిపోవడంతో వాటిపై పరదాలు కప్పుకునేందుకు ఉరుకులు, పరుగులు పెట్టారు. అకాల వర్షానికి పొగాకు, మిర్చి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు పలు ఇబ్బందులు పడ్డారు. తడిసిన పొగాకు, మిర్చి పంటలు రంగుమారి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోండి

లింగపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలో 2,200 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారని సుమారుగా 6 మెట్రిక్ టన్నుల నుంచి 7 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడులు వచ్చే అవకాశముందన్నారు. మండలంలో లింగపాలెం, ధర్మాజీగూడెం, రంగాపురం, కె.గోకవరం, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 75 కేజీల ధాన్యం బస్తా ధర రూ.1740 నిర్ణయించినట్టు తెలిపారు.

## ఆటోనగర్‌లో కార్మికులకు స్థలాలివ్వాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్‌లో స్థలాలివ్వాలని ది ఏలూరు కార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ అధ్యక్షుడు ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఏలూరులో సొంతంగా షెడ్లు నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్న 200 మంది కార్మికులకు స్థలాలు కేటాయించాలన్నారు. ఇరిగేషన్ స్థలాల్లో బోర్డులు పెట్టి మెకానిక్ షెడ్లు నిర్వహించకుండా అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సమావేశం తీర్మానించింది. సమావేశంలో బి.హరినారాయణమూర్తి, కె.వెంకటపతి, కె.చంద్రశేఖర్, కాటూరి శ్రీధర్, జి.నాగరవికిషోర్ పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

## ఏలూరు జిల్లా సగర సంఘం నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరి ష్కారానికి, వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని సగర సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం సగర సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం గండికోట సీతారామరాజు అధ్యక్షతన జరి గింది. రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపీరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనం తరం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షునిగా కుప్పాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తాడిశెట్టి శివప్రసాద్, కోశాధికారిగా తాడిశెట్టి శివయ్య, యువజన సంఘం అధ్యక్షునిగా ఇబ్బా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గాదె రమణ, ఏలూరు నగర అధ్యక్షునిగా కగ్గా ప్రసాద్, యువజన అధ్యక్షునిగా రెడ్డి రామకృష్ణ ఎన్నికయ్యారు.



బౌద్ధారామాలను సందర్శించేందుకు వచ్చిన గ్రీన్‌కోర్ విద్యార్థుల బృందం

## బౌద్ధారామాలను సందర్శించిన గ్రీన్‌కోర్ విద్యార్థులు

కామవరపుకోట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కామవరపు కోట మండలం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం గట్టుపై ఉన్న బౌద్ధారామాలను 60 మంది విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యా యులు శనివారం సందర్శించారు. ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్, విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప సంచాలకులు పి.స్రవంతి ఆదేశాలతో ఈ కార్య క్రమం చేపట్టారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయ కర్త స్వర్ణ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి.. పోలసానపల్లిలో నాయకులతో ధర్మరాజు

## రోడ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్ల నిర్మాణా నికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. 6వ డివిజన్ ఇందిరా కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లను ఎమ్మెల్యే చంటి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మా ట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు దుర్భరంగా మారాయన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చామన్నారు. ఇప్పుడు నూతనంగా రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి పాల్గొన్నారు.

### పోలసానపల్లిలో రోడ్డు ప్రారంభం

భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. పోలసానపల్లిలోని పంచాయతీ నిధులతో నిర్మించిన అంతర్గత గ్రావెల్ రోడ్డును ఉపాధి పథకం నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో హిందూ స్మశాన వాటికలో బోర్‌వెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ షేక్ రహిమా అసీనీ బేగమ్, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే చెట్టున్నపాడులో ఉపాధి హామీ 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు.

### పట్టిసీమ సుదర్శన కల్యాణ వెంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ సుదర్శన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం తాళ్ళపూడి గోపాలపురం మండలాల నుంచి మహిళా భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడిగూడెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో , పాతపోలవరం అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో, గుంజవరం ఉమా సహిత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


ఉదయం సమయంలో ఎండ


మధ్యాహ్నం కురుస్తున్న వర్షం

## ఉదయం ఎండ... సాయంత్రం వర్షం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్షేత్రంలో శనివారం ఒక్కసారిగా చిత్రమైన వాతావరణం ఏర్పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ దంచికొట్టింది. మధ్యాహ్నం 2 నుంచి ఒక్కసారిగా వాతావరణం మారి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులు వర్షంలోనే పరుగులు తీశారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం వరకూ ఎండ వేడిమిని యాత్రికులు తట్టుకోలేక పోయారు. వర్షానికి వాతావరణం చల్లబడటంతో మండపప్రాంతంలో శ్రీవారి క్షేత్రానికి వచ్చిన భక్తులు కొంతసేపు సేద తీరారు. ఎంతసేపటికీ వర్షం తగ్గక పోవడంతో క్షేత్రానికి వచ్చిన యాత్రికులు తడుస్తూ శ్రీవారి దర్శనానికి పరుగులు తీశారు.

## భీమడోలు సీహెచ్‌సీకి వాటర్ కూలర్ బహూకరణ

భీమడోలు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు కరుటూరి ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన సొంత నిధులు రూ. 40 వేలతో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ పరికరాన్ని భీమడోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు హాజరై వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు, సిబ్బందికి పండ్లు, బ్రెడ్ అందజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కూలర్‌ను ప్రారంభిస్తున్న గన్ని వీరాంజనేయులు

# పేదల కోసం జగ్జీవన్ రామ్ కృషి


దర్భగూడెంలో పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

ఏలూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ప్రశంసనీయమని జేసీ పి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని జేసీ, నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎమ్మెల్యే బడేటి చంటిలు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అణగారిన వర్గాలను ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, మైనార్టీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, ఏలూరు తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, నగర డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, నాయకులు పొలిమేర హరికృష్ణ, మెండెం సంతోశ్ కుమార్, దాసరి ఆంజనేయులు, మేతర అజయ్‌బాబు, కలపాల రవి, నేతల రమేశ్, ధనియాల శంకర్, తోకల రాజేష్, దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బీ.మనోజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీ.సాల్మన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జీ.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.ధర్మలింగం, కోశాధికారి జీవీ.రమణ, ప్రచార కార్యదర్శి శ్రీనివాసరావు, కృపాకరణ్, జేసుదాసు, పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాల కార్యదర్శి ఎం.శేఖర్‌బాబులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణరావు, సందీప్ కుమార్, అస్లాం బాష, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో అధ్యక్షులు ఎం.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. మానవత సంస్థ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ నేతర అజయ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్‌బాబు, ఎం.వెంకన్న, సీహెచ్. శ్రీనివాసరావు, రామయ్య, తోటకూర రవి, జీవన్ కుమార్, శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు. ఏపీఎన్‌జీఎస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎస్ ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలకార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు ఆధ్వ ర్యంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. కార్యక్ర మంలో లంకపల్లి మాణిక్యాలరావు, ఎం.సంతోశ్‌కుమార్, పాల్ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : స్థానిక విద్యుత్ భవన్‌లో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.ఎం.అంబేద్కర్, టి.శశిధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రాజ్ కుమార్, నాయకులు జి.పాల్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, పరివర్తన్ బధిరుల పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం ఎదుట నివాళులర్పించారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ బి.రామ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, డిడిఆర్‌సి సిబ్బంది, డీఎడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : బాబూ జగజ్జీవన్ రామ్ జయంతిని టీడీపీ పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమర్తి రామ కుమార్, చిట్రోజు తాతాజీ, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్,షేక్ యాకూబ్, నాయుడు శ్రీను, మారిశెట్టి సత్యనారాయణ, గంగాధర్, అభిరామ్ పాల్గొన్నారు. శ్రీనివాసపురంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేష, జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, ఎం అంజి, పి సత్తిపండు, బి రాజ్‌పాల్‌కుమార్ పాల్గొని నివాళులర్పించారు.

● ఏలూరు క్రైం : ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ డి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, అమరేశ్వరరావు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంకా రామ్మోహన్, గౌడు రంగబాబు, ప్రతాప బాల వెంకట సుబ్రహ్మణ్య శర్మ, కె.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

● చింతలపూడి : ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోలవరం : ఎస్ఐ పవన్ కుమార్, ఎంఆర్పీఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు తోలేటి రఘు, ఉండ్రాజవరపు నరసింహ మూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని, బ్యాటరీ పోశి, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, పెద్దేపూపు వీరవెంకట సత్యనారాయణ, పోతుల శ్రీను పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జేసీ ధాత్రి, ఎమ్మెల్యే చంటి

● ద్వారకాతిరుమల : జి.కొత్తపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

● కామవరపుకోట : తాడిచర్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోరింక దాసు, వేముల హనుమంతు, కంఠమనేని అంజిమూర్తి, దోరేపల్లి నాగు, డోలా విజయ్, రెబ్బా పరాత్పరరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : కెఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో కె.శిరమయ్య, నాయకులు యు.పెంటయ్య, బి.ఎలీషా, ఎ.ప్రాన్సిస్, ఎస్.శివాజీ, డి.బాలు, చిడిపి గంగాధర్‌రావు, ఎం.దుర్గాప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, డి.సుదర్శన్, టి.కిషోర్, జె.నాగు, ఎ.పండు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : దర్భగూడెంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి టీఎస్.రవికుమార్, ఎంపీటీసీ సున్నం సురేష్, అంబేద్కర్ సంఘం సభ్యులు కె.ప్రకాశం, జె.పెద్దిరాజు, జె.వంశీ, ఎ.రాంబాబు ఉన్నారు.

● లింగపాలెం : లింగపాలెం, ధర్మాజీగూడెంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, మోరంపూడి రంగారావు, గారపాటి బుజ్జయ్య, ఎం వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : ఉప్పాకపాడు, నారాయణపురం అరుంధతీ కాలనీలోను నల్లమాడు, కైకరం, కురెళ్లగూడెం గ్రామాల్లో ఎం.ఆర్.పి.ఎస్. నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నేకూరి ఆశీర్వాదం, దున్న మధు ఆధ్వర్యంలో హైకోర్టు పి.పి.ఉండ్రాజవరపు కనక రాజును సత్కరించారు. నల్లమాడు, కైకరం గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో మామిడూరి ఏలియ,పెనుమాక వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : నక్కినవారిగూడెం, కె.జగ్గవరం, టి.నర్సాపురంలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జయబాబు, దేవరపల్లి ముత్తయ్య, సీహెచ్.నవీన్, లంకా జయబాబు, నందిపం రవి, దుర్గయ్య, జుజ్జవరపు జయ రాజు, శ్రీను, రాయల చీరయ్య పాల్గొన్నారు.

## శ్రీరామ నవమికి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మన్యంలో కొలువైన వనదేవత శ్రీ గుబ్బల మంగమ్మ ఆలయ ప్రాంగణాన్ని శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని వివిధ రకాల పుష్పాలతో ఆలయ కమిటీవారు ప్రత్యేకంగా శనివారం అలంకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులను ఇట్టే ఆకట్టుకుంటోంది. ఆదివారం వస్తే చాలు అమ్మవారిని దర్శనానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పోటెత్తుతారు. శ్రీరామనవమి కూడా ఆదివారం రావడంతో భక్తుల కోసం కమిటీ వారు అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని పూలతో అలంకరించి భక్తులకు స్వాగతం పలుకుతున్నారు. కమిటీ చేసిన అలంకరణ పనులను భక్తులు మెచ్చుకుంటున్నారు.

### పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● చింతలపూడి : శ్రీరామనవమి ఉత్సవాలకు పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. చింతలపూడిలోని మారుతీనగర్‌లో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయం, వెలమపేటలోని కోదండ రామాలయంలో, యర్రగుంటపల్లి -మక్కినవారిగూడెం మార్గంలోని రామునిగట్టు వద్ద ఉత్సవాలకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

● ఉంగుటూరు : మండలంలోని నారాయణపురం ఎన్టీఆర్ కాలనీలో కొత్తగా కోదండరామాలయంలో నూతన విగ్రహాలు ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల పాటు జరిగిన పూజాదికాల్లో స్వామి అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠలు చేశారు.ఈ కార్యక్రమాలకు జిల్లా టి.డి.పి.అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు,ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు,సర్పంచ్ దిడ్ల అలకనంద పాల్గొన్నారు.

● పెదవేగి : లక్ష్మీపురం శివారు శ్రీసాయి హైస్కూల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయ, లవకుశ పాత్రల్లో విద్యార్థులు అలరించారు. లవకుశ పాత్రలు ధరించిన హస్విక, దీక్షితలు రామాయణ కథ ఇతివృత్తాన్ని వినిపించిన విధానం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఆచరించడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బోయపాటి సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెత్తను తొలగించండి మహాప్రభో

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకుగాను డివిజన్ల వారీగా సిబ్బంది ఉన్నప్పటికీ ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దుర్వాసనలు వస్తున్నాయని,దోమలు పెరిగాయని ప్రజానీకం గగ్గోలు చేస్తున్నారు. గతంలో ఫాగింగ్‌లు నిర్వహించేవారని, ఇటీవల ఫాగింగ్ కూడా నిర్వహించకపోవడంతో దోమలు మరింత పెరిగాయని చెప్పారు. నగరానికి సమీపంలోనే ఏలూరు కాలువ ఉండడం, ఆ కాలువలో తూడు, కిక్కిస అధికంగా ఉండడంతో నగరానికి దోమల బెడద పెరిగిందని ప్రజానీకం తెలియచేస్తున్నారు.డ్రెయినేజీల్లో పూడికలు తీసినప్పటికీ వాటిని ఎత్తివేయకుండా రోడ్ల పక్కన గుట్టలుగా ఉంచుతున్నారని, దీంతో అశుభ్రత పెరిగిందని తెలియచేస్తున్నారు. పారిశుధ్యంను మెరుగుపర్చాలని, నిల్వ ఉన్న చెత్త కుప్పలను తీసివేయాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


పవరుపేట రైల్వే ట్రాక్ పక్కనే పేరుకున్న చెత్త

## వాకింగ్ ట్రాక్‌కు మెరుగులు

చింతలపూడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో తొలి అభివృద్ధి పథకం వాకింగ్ ట్రాక్‌ను ఇటీవల ప్రారంభించారు. నగరం నడిబొడ్డున ఉన్న వేగిలింగేశ్వరస్వామి చెరువు గట్టునే ఈ ట్రాక్‌ను ప్రారంభించారు. గత వైసీపీ హయాంలో 78 లక్షలతో అమృత్ 2.0 పథకంలో భాగంగా ఈ చెరువు గట్టుపై 2022లో పనులు చేపట్టారు. అయితే టెక్నికల్ అధికారులు పర్యవేక్షించి నగర పంచాయతీకి అప్పగించకపోవడంతో ఇంత కాలం ఆలస్యమైంది. మునిసిపల్ అధికారులు తిరిగి ఈ ట్రాక్‌ను శుభ్రం చేసి దాతల సహకారంతో పది బెంచీలు ఏర్పాటు చేసి ట్రాక్ పొడవునా మొక్కలు, మరోపక్క లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే ఈ వాకింగ్ ట్రాక్‌కు కొద్ది దూరంలోనే కళాశాలలో వాకింగ్ ట్రాక్ ఉండగా చెరువుగట్టుపై మరొకటి ఎందుకని విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీలపై దృష్టి పెట్టకుండా వాకింగ్ ట్రాక్‌పై ఎందుకు డబ్బు ఖర్చు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మునిసిపల్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ఏదిఏమైనా అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టడంపై నగర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న వాకింగ్ ట్రాక్

### వాకింగ్ ట్రాక్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం



నగర పంచాయతీ నడిబొడ్డున ఉన్న చెరువుగట్టుపై ఏర్పాటు చేసిన ఈ వాకింగ్ ట్రాక్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం. ఇందుకు దాతల సహకారం తీసుకుంటున్నాం. దాతలు ముందుకొచ్చి నగర అభివృద్ధికి సహకరించాలి.

**డి.పావని, మునిసిపల్ కమిషనర్**

## తాగునీరు వృథా..

అధికారుల నిర్లక్ష్యంతో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నీరు వృథా అవుతోంది. పైపుల నుంచి పోతూ చెరువులా మారుతోంది. ప్రధాన రహదారి వద్దే పైపు పగిలి ఉన్నా అధికారులు, సిబ్బంది చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.. దీంతో ఆస్పత్రి వార్డుల్లో ఉంటున్న వారికి పూర్తిస్థాయిలో నీరు అందడంలేదు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని శనివారపుపేట రోడ్డు నుంచి ఆసుపత్రి వెళ్లే రోడ్డు వద్ద భారీ వాహనాల రాకపోకలతో పైపులు పగిలిపోయి నీరు వృథా అవుతోంది. మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు జరుగుతున్న దృష్ట్యా భారీ వాహనాలు రాకపోకలతో పగిలిన పైపులను మెడికల్ కాలేజీ భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఇంజనీర్లే మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ ముగ్గురు తమకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరించడంతో నీరు వృథా అవుతోంది.




ఏలూరు క్రైం, (ఆంధ్రజ్యోతి)


అచ్చాయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నానీ

## ఘంటా ప్రసాద్ దంపతులకు పరామర్శ

పెదపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ దంపతులను మాజీ మంత్రి ఆళ్ల నాని శనివారం పరామర్శించారు. ప్రసాదరావు తల్లి అచ్చాయమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, ఏలూరు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, పెదవేగి మండలాల జడ్పీటీసీ సభ్యులు పరామర్శించారు.


మేదినరావుపాలెంలో నిర్మాణంలో ఉన్న ఆలయం

## రామాలయ నిర్మాణానికి విరాళం

దెందులూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : మేదినరావుపాలెం సర్పంచ్ భార్యభర్తలు ఎన్నికల్లో ఇచ్చి హామీ మేరకు రామాలయం నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం అందజేశారు. గ్రామ సర్పంచ్‌గా వైసీపీ మద్దతు ఇవ్వకపోయినప్పటికి మనుబోలు వెంకట దుర్గ కుమారి రాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అలాగే పలు చర్చి, గుడిలకు సదుపాయాలు లేవని అడగడంతో రూ.10 వేల చొప్పున అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత నిధులు రూ. 50 వేలు ఇచ్చి రోడ్డు పనులు చేయించారు.

## ఎంపీటీసీ కుటుంబానికి నాయకుల పరామర్శ

జీలుగుమిల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పి.అంకంపాలెం ఎంపీటీసీ టీడీపీ మండల కార్యదర్శి నాలి శ్రీను కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర కార్యాదర్శి శీలం వెంకటేశ్వరావు పరా మర్శించారు. ఇటీవల నాలీ శ్రీను వదిన నాగ లక్ష్మి కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మర ణించారు. దీంతో శనివారం వారి కుటుంబ సభ్యుల్ని టీడీపీ, యాదవ సంఘం నాయ కులు పలువురు పరామర్శించారు.

## బెల్లపు ఊట ధ్వంసం

టి.నర్సాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సారా స్థావరంపై దాడి చేసి 200లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు. టి.నర్సాపురం మండలంలోని తిరుమల దేవిపేట గ్రామంలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో శనివారం దాడి చేసి బెల్లపు ఊట ధ్వంసం చేసి, 110 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


విజేతలతో పోటీల నిర్వాహకులు

## విద్యార్థులకు బహుమతులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : విజయవాడలో శనివారం జరిగిన 12వ ఆలిండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటీషన్ కం ఎగ్జిబిషన్ చిత్రలేఖనం పోటీలో శనివారపుపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని డ్రాయింగ్ స్కూలు టీచరు ఎండీ ఇర్షాద్ అహ్మద్ తెలిపారు. బాల చిత్రకారులు, కార్టూనిస్టులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో ఈ పోటీలు ఏటా నిర్వహిస్తామన్నారు. చిత్రకళా ప్రదర్శనలో పాల్గొన్న స్కూలు విద్యార్థులు సి.హెచ్.వైష్ణవి, తేజస్వి, ఎ.నాగరాజు, ఆర్.సాయికీర్తన, సి.హెచ్.యాత్విక్ రత్నలకు స్వర్ణపతకాలు, ఆర్.రూత్ రాజ్‌గ్రేస్, సీహెచ్.జ్యోత్స్నలకు రజిత పతకాలు లభించాయని తెలిపారు.


కోలాటం నిర్వహిస్తున్న కళాకారులు

## ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో శనివారం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సంప్రదాయ దుస్తులు ధరించి సుమారు 70 మంది కోలాట సమాజ బాలలు, పెద్దలు ముందుగా క్షేత్రానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆ తరువాత వివిధ దేవతా మూర్తులను కీర్తిస్తూ వారు నిర్వహించిన కోలాట ప్రదర్శనతో ఆ ప్రాంతం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది.


సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

## వసంత నవరాత్రి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అంబికాదేవి ఆలయంలో శనివారం వసంత నవరాత్రి పూజల్లో భాగంగా మహిళలతో ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ సామూహిక పూజలు, దీపారాధనలు జరిపించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని ఆరాధించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ వసంత నవరాత్రుల్లో భాగంగా ఏడవ రోజు ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో సీతారామకళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలియచేశారు.

## చిత్తులాటలో ఐదుగురి అరెస్టు

లింగపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చిత్తులాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ధర్మాజీగూడెం ఎస్.ఐ. కె.వెంకన్న తెలిపారు. ధర్మాజీగూడెం శివారులో చిత్తులాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6,042 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## శ్రీవారి సేవలో ఏఎంసీ నూతన చైర్మన్ బ్రహ్మరాజు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని గోపాలపురం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన యద్దనపూడి బ్రహ్మరాజు శనివారం సాయంత్రం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మర్యాద పూర్వక స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని అందజేయగా ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ భాస్కర్, డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈఓ పి నటరాజారావు పాల్గొన్నారు.


శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

## ఉపాధి హామీ పనులు ప్రారంభం


పంట బోదెల తవ్వకం పనులను ప్రారంభిస్తున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు

ముదినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో పనులు ప్రారంభమయ్యాయి. 2024-25 సంవత్సరంలో మండలంలో 95 శాతం పనిదినాల లక్ష్యాన్ని సాధించగా, 2025-26 సంవత్సరానికి పనుల ప్రణాళికను అధికారులు రూపొందిస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు మండలంలోని 32 పంచాయతీల పరిధిలో సుమారు 3 వేల పని దినాలను జాబ్‌కార్డు హోల్డర్లకు కల్పించాలన్నది లక్ష్యం. జిల్లా అధికారుల నుంచి మార్గదర్శకాలు, లక్ష్యాలు అందాక త్వరలోనే పూర్తిస్థాయి ఉపాధి పనుల ప్రణాళికను రూపొందిస్తామని మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో హేమంత్ తెలిపారు. ఖరీఫ్ సీజను ప్రారంభమయ్యే నాటికి పంట కాల్వల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని, పంచాయతీ చెరువులకు నీటిని సరఫరా చేసే కాల్వలను బాగు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అల్లూరులో పనులను తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ప్రారంభించారు.

## తాళాలు వేసిన ఇంట్లో చోరీ

వడాలిలోరూ.8 లక్షల విలువైన నగలు అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వీరభద్రరావు

ముదినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తాళాలు వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.8 లక్షల విలువైన 11 కాసుల బంగారపు ఆభరణాలు, టీవీని అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. వడాలికి చెందిన బత్తుల నాగమణి భర్త ఐదేళ్ల క్రితం చనిపోగా ఆమె ఒంటరిగా ఉంటోంది. గతనెల 16న ఆమె ఆరోగ్య పరీక్షలకు గుడివాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి అక్కడ రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద ఉంది. తిరిగి శనివారం ఉదయం వడాలి రాగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడం గమనించింది. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలోని 11 కాసుల బంగారపు ఆభరణాలు, రూ.25 వేల నగదు, టీవీని ఎత్తుకుపోయినట్టు గుర్తించింది. ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు నుంచి క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. ముదినేపల్లి - భీమవరం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ఇంటిలో దొంగతనం జరగడం విశేషం. గత 20 రోజులుగా ఆ ఇంటిలో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

## మద్యం మానేయమని భార్య మందలింపు | ఎలుకల మందు తాగి భర్త ఆత్మహత్య

కలిదిండి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పడమటిపాలెం గ్రామానికి చెందిన కొట్టి శ్రీనివాసరావు (35) ఈ నెల 3న మద్యం తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా భార్య మద్యం మానేయమని మందలించింది. దీంతో అతను మనస్థాపానికి గురై ఈ నెల 4న ఎలుకల మందును నీళ్లలో కలుపుకుని తాగాడు. కుటుంబభ్యులు వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. భార్య, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పాప పశ్చాత్తాప పాదయాత్ర చేస్తున్న క్రైస్తవులు

## క్రైస్తవుల పాప పశ్చాత్తాప పాదయాత్ర

మండవల్లి ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం నుంచి ముదినేపల్లి వరకు భైరవపట్నం విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ శాంత్‌రాజు ఆధ్వర్యంలో పాప పశ్చాత్తాప పాదయాత్ర శనివారం ఉదయం నిర్వహించారు. ఉదయం 6గంటలకు యాత్రను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి సంఘ స్తులు, సంఘ పెద్దలు, ఉపదేశులు, దళసభ్యులు యూత్ వారు, దీక్ష సభ్యులు పాదయాత్రలో పాల్గొన్నారు.

## రేపటి నుంచి మూడుతాళ్లపాడు రైల్వేగేటు మూసివేత

మండవల్లి ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండవల్లి-మూడుతాళ్లపాడు రైల్వేగేటును ఈనెల 7 నుంచి 13 వరకు మూసివేస్తున్నట్టు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎండీ అబ్దుల్ రహమాన్ తెలిపారు. లెవల్ క్రాసింగ్ 74 (63 కిలోమీటరు) వద్ద అత్యవసర ట్రాక్ మరమ్మతులు చేపడుతున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం నుంచి 13వ తేదీ రాత్రి 7గంటల వరకు గేటు మూసివేస్తారని తెలిపారు.




ఆటపాకలో శ్రీరామాలయం వద్ద చలువపందిర్లు.. విద్యుద్దీపాలంకరణలో అపరభద్రాద్రి చనుబండ రామాలయం.. తాడినాడ సీతారాముల ఆలయం

## రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

కైకలూరు/కలిదిండి/ముసునూరు/ముదినేపల్లి ,చాట్రాయి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకలకు గ్రామాల్లోని రామాలయాల వద్ద ఏర్పాట్లను పూర్తిచేశారు. నేడు సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు అయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కైకలూరు మండలం ఆటపాక రామాలయం వద్ద చలువపందిర్లను ఏర్పాటు చేసి తోరణాలతో అలంకరించారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో వేడుకలు జరిపేందుకు విద్యుత్‌దీపాలతో ఆలయాలను ముస్తాబు చేశారు. కలిదిండి మండలంలోని తాడినాడ రామాలయంలో సీతారాముల కల్యాణం వీక్షించడానికి భక్తులకు ఏర్పాట్లు చేశామని ఈవో శేఖర్ తెలిపారు. కలిదిండి, కోరుకొల్లు, గుర్వాయిపాలెం, మూల్లంక, పెదలంక, మట్టగుంట, కొండంగి గ్రామాల్లో రామాలయాలను ముస్తాబు చేశారు. రాములోరి కల్యాణం అనంతరం ఆలయాల కమిటీలు ఆధ్వర్యంలో అన్న సమారాధనలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ముసునూరు మండలంలోని ముసునూరు, గోపవరం, గోగులంపాడు, చెక్కపల్లి, రమణక్కపేట, గుడిపాడు తదితర గ్రామాల్లో ఉన్న కోదాండరామాలయాలకు నిర్వాహకులు రంగులు వేసి, చలువ పందిర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెంలోని బావాజీ మఠంలోని కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా జరుగుతున్న తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఈవో పి.వై.నాయుడు, అర్చకుడు ఆచూరి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, పూర్ణాహుతి, బలిహరణ, గోపూజలు, అశ్వవాహనంపై కోదండ రామస్వామి గ్రామోత్సవం జరిపారు. కాగా ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చాట్రాయి మండలంలోని అపరభద్రాద్రి చనుబండ కోదండరామస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయానికి, కల్యాణ మండపానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 11.45 గంటల నుంచి కల్యాణ క్రతువు మొదలవుతుంది. భక్తులకు తాగునీరు, మజ్జిగ, బెల్లం పానకం, పులిహోర పంపిణీకి ఏర్పాట్లు చేశారు. స్వామి కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు సొంతూళ్లకు వస్తున్నారు. 1713లో ఈ ఆలయాన్ని నరసింహారావుపాలెంకు చెందిన రామభక్తుడు పుచ్చకాయల రామిరెడ్డి నిర్మించారు.


సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండ రామస్వామి దేవస్థానంలో గోపూజలు

## ముదినేపల్లి రామాలయంలో.. సీతారాముల విశిష్ట విగ్రహం


రాముడి కాలుపై కూర్చున్న సీతమ్మ విగ్రహం

ముదినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని సీతారామస్వామి (పెద రామాలయం) ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. సుమారు 300 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో అప్పట్లో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భద్రాచలం ఆలయంలోని విగ్రహాల మాదిరిగా ఈ ఆలయంలో శ్రీరాముడి ఎడమ కాలుపై సీతమ్మ అమ్మవారు కూర్చున్న విగ్రహాలను ఏర్పాటు చేశారు. సాధారణంగా లక్ష్మణుడు, ఆంజనేయ స్వామితో కలపి రామాలయాల్లో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. కాని ఈ ఆలయంలో లక్ష్మణుడు, ఆంజనేయుడు లేకుండానే సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించడం విశేషం. అయితే 1983లో లక్ష్మణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎదురుగా నిర్మించిన మందిరంలో ఆంజనేయుడి విగ్రహం ఉంది. భద్రాచలంలో మాదిరిగా సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పరిసర ప్రాంత భక్తులు ఎక్కువగా దర్శించుకునే వారట. 'ముదినేపల్లి సీతారామస్వామి ఆలయానికి ఒక విశిష్టత ఉంది. భద్రాద్రి ఆలయ సీతారామ విగ్రహాలను పోలిన విగ్రహాలే ఈ ఆలయంలో ఉన్నాయి. ఇక్కడి రాముడు భక్తుల కోర్కెలను నెరవేర్చుతాడన్న నమ్మకం ఉంది' అని అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు తెలిపారు.

## దళిత రామం

- ఆరుచోట్ల దళిత గిరిజన రామాలయాలు
- పూజారులు దళితులు, గిరిజనులే
- సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు


జనార్ధనవరం దళితవాడలోని రామాలయం

చాట్రాయి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో దళితులు, గిరిజనులకు ఆరు చోట్ల ప్రత్యేక రామాలయాలు ఉన్నాయి. జనార్ధనవరం మాలపల్లి దళితవాడ, తుమ్మగూడెం చదలవాడ, పోతనపల్లి పడమర లంబాడి తండా, తూర్పు లంబాడి తండా, మర్రిబంధం, నాయకులగూడెంలలో రామాలయాలు ఉన్నాయి. ఆదివారం ఈ ఆలయాల్లో సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయాల నిర్వహణ, ఉత్సవాలు, సీతారాముల కల్యాణం దళితులు, గిరిజనులే నిర్వహించడం ఆచారం. ఈ ఆలయాల్లో నిత్య కైంకర్యాలు చేసేది దళితులు, గిరిజనులే కావడం విశేషం. ఈ ఆలయాల్లో పనిచేసే పూజారులకు తిరుమల తిరుపతి దేవస్థానం శిక్షణ ఇచ్చింది.


జనార్ధనవరం దళితవాడ రామాలయంలో దళిత పూజారి దారా మురళి

## వక్ఫ్‌బోర్డు సవరణతో ముస్లింలకు ప్రయోజనం


మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు చట్ట సవరణతో పేద ముస్లింలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు, ముస్లిం నాయకులు స్పష్టం చేశారు. నూజివీడులోని మంత్రి పార్థసారథి క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మూడు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలను చేర్చి ఆమోదించడం ద్వారా పేద ముస్లిం వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ముస్లింలమని చెప్పుకునే కొందరు బడా భూస్వాములు, కబ్జాదారులు మాత్రమే వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించారని అన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని కొందరు రాజకీయ పార్టీ నాయకులు చేసే ప్రచారంలో వాస్తవం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ముస్లిం నాయకులు షేక్ మున్ని, అమీర్‌ఖాన్, రియాజ్‌ఖాన్, సుభాని, వజీర్, నజీమా, గౌసియా, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి



స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ శనివారం మృతి చెందాడు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం వదర్లపాడుకు చెందిన బాలాజీ(27) ఘన్‌పూర్ పట్టణంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇంట్లోని మోటార్ రిపేరుకు రావడంతో ఏసిన స్వచ్ ఆఫ్ చేయకుండానే సంపు వద్దకు వెళ్లి మోటార్‌ను బయటకు తీస్తుండగా విద్యు దాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

## పెదగొన్నూరు రోడ్డు అభివృద్ధికి నిధులు

ముదినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న పెదగొన్నూరు పంచాయతీ ఏరియాలోని ఆర్అండ్‌బీ లింకు రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.120 కోట్లు నిధులు మంజూరు చేసింది. సింగరాయపాలెం - భీమవరం ప్రధాన రహదారిలో విశ్వనాద్రి పాలెం నుంచి పెదగొన్నూరు మీదుగా బంటు మిల్లి రోడ్డులో కలిసే సుమారు మూడు కిలోమీటర్లు కలిగిన ఈ రోడ్డు నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. ఎన్నికల్లో ప్రధానంగా ఇచ్చిన హామీ మేరకు గ్రామ ప్రముఖుడు, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్. నారాయణ, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. దీంతో సర్పంచ్ తాడంకి శిరీష, డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్ బాబు, కూటమి నాయకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


ఆటపాకలో జగజ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి


నూజివీడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముద్రబోయిన, తదితరులు


వలసపల్లిలో బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, నాయకులు

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ముదినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చేవూరుపాలెం గ్రామంలో సుమారు రూ.2.50 లక్షల పంచా యతీ నిధులతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులకు శనివారం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు శంకుస్థాపన చేసి ప్రారంభించా రు. ఉపసర్పంచ్ బత్తుల నాగేశ్వరమ్మ, సభ్యుడు ఆనందాసు నాగ రాజు, పరసా చింతలమ్మ, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 133, 142, 153 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

## దళిత జనోద్ధారకుడు జగ్జీవన్‌రామ్


పెదపాలపర్రులో నివాళులర్పిస్తున్న శోభనాద్రి చౌదరి

చాట్రాయి/కైకలూరు/ముదినేపల్లి/కలిదిండి/ముసునూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దళితజనోద్ధారకుడు జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు అన్నారు. సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పలుచోట్ల ఘనంగానిర్వహించారు. చాట్రాయి మండలం చనుబండలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత నాయకులు కొండేటి బాబీ, అప్పికట్ల కుమార్, మోదుగు ముత్తయ్య పాల్గొన్నారు. అనంతరం 100 మంది వితంతువులు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. చీపురుగూడెంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు పూలమాల వేశారు. వలసపల్లిలో సర్పంచ్ చలసాని, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర, వీఆర్‌పీ ప్రసన్నకుమార్, కాట్రేనిపాడులో సర్పంచ్ సుహాసిని మోహన్‌రావు, టీడీపీ నాయకులు రాపర్ల ప్రతాప్, మొక్కపాటి బుజ్జియ్య, రమణక్కపేటలో జనసేన నాయకులు పాశం నాగబాబు, ఆముదాల నేబుల్‌రాజు, మాజీ సర్పంచ్ జంజూనూరు కృపారావు తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్‌లు కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు.

**మాజీ ఎమ్మెల్సీ విఠలరావు ఆధ్వర్యంలో..**

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు మండలం ఆటపాకలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు మహోన్నతమైనవని నేటి యువత వాటిని ఆచరించి సన్మార్గం వైపు పయణించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు.మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహ రావు, కోకన్వీనర్లు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, కొడాలి వినోద్, తేరా రమేష్ బాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి, కూటమి నేతలు మంగినేని రామకృష్ణ, ఎండీ జానీ, వీరాబత్తిన సుధా పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం చేవూరులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, పెదపాలపర్రులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, సర్పంచ్ గంటా రాకేష్, ఉపసర్పంచ్ గన్నమనేని వెంకటేశ్వరరావు, పెనుమల్లి శివారు సీయోను కాలనీలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలిదిండి మండలం మట్టగుంటలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**నూజివీడు టౌన్:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మనమదలలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముసునూరి రాజా సుంకలు, తెలుగుదేశం పార్టీ నాయకులు దుప్పలపూడి సాంబయ్యనక్కలపు ప్రసాద్‌లు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**బీజేపీ ఆధ్వర్యంలో :** నూజివీడు పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి బాపునగర్ కూడలి వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు బోను అప్పారావు, ఎం రాజశేఖర్, మాగంటి వాసు, అంబటి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


చనుబండలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు